క్లుప్తంగా

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పూర్వప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి తక్కువ బరువు ఉన్నవారిని గుర్తించారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించినట్లు ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా హరీష్ సూచించారు. కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు ఉమ, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయ్, ఎల్లమ్మ, హెల్పర్లు నిరంజన్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



చారకొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో ఎన్నికల్లో మల్లు రవి గెలుపుకోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు.

వర్షానికి కూలిన కళాశాల ప్రహరీ



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో గురువారం కురిసిన వర్షానికి కొల్లాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ కూలింది. ప్రహరీ నిర్మాణం జరిగి ఏడాది పూర్తికాకముందే చిన్నపాటి వర్షానికే ప్రహరీ కూలడంపై స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం వల్లే కూలిందని ఆరోపించారు. వెంటనే పునః నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూలిన ప్రహరీని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. నాణ్యత లేకుండా ప్రహరీని నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.33 లక్షలు వెచ్చించిన నాణ్యతలేకుండా నిర్మించడం సరికాదన్నారు. అధికారులు విచారణ చేయాలని కోరారు. అనంతరం బీఎస్‌ఎఫ్ నాయకులు కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ నాయకులు బహుజన సమాజ్‌పార్టీ నాయకులు బుళపాగ మధు, శ్రీకాంత్, మహేష్, రామకృష్ణ, కళ్యాన్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గురై ఎద్దు మృతి

ఉప్పునుంతల: మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున పిడుగుపాటుకు గురై రైతు సూరం రాజెందర్‌రెడ్డికి సంబంధించిన కాడి ఎద్దు మృతిచెందింది. ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో రెండు ఎద్దులను కట్టేసి ఉంచారు. పిడుగు పడి ఒక ఎద్దు మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. ఎద్దు విలువ సుమారుగా రూ. 60 వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని పెద్దముద్దునూర్ నుంచి మంతటి క్రాస్ రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రోడ్డును 50 ఏళ్ల కిందట నిర్మించారని దీంతో రోడ్డు గుంతలమయంగా మారింది వాపోయారు. మరమ్మతుకు నోచుకోకపోవడంతో వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు వెంట బస్సు సర్వీసులు నడిపేవారని స్థానికులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు వరకు వెళ్లి బస్సు ఎక్కి వెళ్లాల్సి పరిస్థితి నెలకొందని వివరించారు. ఈ రోడ్డు నిర్మాణం చేపడితే మంతటి క్రాస్ రోడ్డు నుంచి మంతటి, గడ్డంపల్లి, దేవానందనగర్‌తో పాటు పెద్దముద్దునూర్ తదితర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలనికి అనువుగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.



బల్మూర్‌లో..



తిరుమలాపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు



కల్వకుర్తి మండలం పంజుగూలలో..

పిల్లలను బడిలో చేర్పించాలి

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని అచ్చంపేట ఇన్‌చార్జ్ ఎంఈఓ రామారావు కోరారు. గురువారం పట్టణంలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బడి బయటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, గణేష్, ప్రణయమ్మ, శ్యామల, సుష్మిత, సింధూరి, రఘునాథ్‌రెడ్డి, స్వాతి పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాంసింగ్ బడిబాటకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, విద్య ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడుల నిర్వహణ వాటి ఉపయోగాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రతిజ్ఞ చేయించారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూలలో యోజన విద్యా మహిళా అంగన్‌వాడీ విద్యార్థుల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంజుగూల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్యగౌడ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గణేష్, శ్రవంతి, ప్రభాకర్, కృష్ణయ్య, పాండయ్య, అలివేల తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో బడిబాట కార్యక్రమం ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ రామారావు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాటలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటింటి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో బడిబాటలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నర్సింహ్మారెడ్డి ఇంటింటికి తిరిగి పిల్లల తల్లిదండ్రులను కలిసి చదువు ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటలక్ష్మమ్మ, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని యాపట్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాకీర్ పాషా కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని యాపట్ల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత యూనిఫాం, అందిస్తుందన్నారు. అనంతరం తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు బడిబాట ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, మంజుల, ప్రవీన్, నరేష్ పాల్గొన్నారు.



లింగాలలో..

లింగాల: మండలంలోని ఆయా పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి, బడిబాటకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. హెచ్‌ఎం బి.శేఖర్, సీపీఎస్ హెచ్‌ఎం పర్వతాలు, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాపట్ల పాఠశాలలో బడిబాట ప్రతిజ్ఞను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో



ఉప్పునుంతలలో బడిబాట కార్యక్రమం చేపట్టిన ఉపాధ్యాయులు

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



విత్తనాలను పరిశీలిస్తున్న ఏఈఓ సీతారాం

మన్ననూర్: ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో పొలాలు సాగు చేస్తున్న రైతులు విత్తన ఎంపికలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ సీతారాం నాయక్ రైతులకు సూచించారు. గురువారం మన్ననూర్‌లో రైతులు సాగు చేస్తున్న పొలాల వద్దకు వెళ్లి వారు విత్తుతున్న పత్తి విత్తనాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విత్తనాలు వేసే విధానం, భూసారంపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వం గుర్తించిన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేసి పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు లక్యా, పురుషోత్తం, జంగయ్య, రాములు, ఉమా, మహిళా రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పాన్‌గల్: క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలని, ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలపై అవగాహన కల్పిస్తూ వైద్యుల సూచనలను పాటించేలా చూడాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలను చైతన్యం చేయాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నాగరాజు, మైథిలి, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అంబట్‌పల్లి ఎరువుల దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ



తిమ్మాజిపేటలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ కమల్‌కుమార్

లింగాల: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని అంబట్‌పల్లిలో ఆయన పలు ఫెర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువులను పీఓఎస్ యంత్రాల ద్వారానే విక్రయించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు రసీదు తప్పని సరి ఇవ్వాలని డీలర్లకు సూచించారు. మండలంలో ఎరువుల కొరత లేదని, అన్ని రకాల ఎరువులు అందుబాటు ఉన్నాయని ఏఓ తెలిపారు.

బిజినేపల్లి: వ్యవసాయ ఎరువుల కోసం వచ్చే రైతుల ఆధార్‌ను ఈ-పాస్ యంత్రాలలో నమోదు చేసి పంపిణీ చేయాలని ఏఓ కమల్‌కుమార్ సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని పలు వ్యవసాయ వ్యాపార దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వ్యాపారులు లైసెన్సులు లేకుండా కాని, రెన్యువల్ చేసుకోకుండా విక్రయాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలోని పలు వ్యవసాయ దుకాణాలలో ఏఓ నీతి తనిఖీలు నిర్వహించారు. యూరియా, డీఏపీ వంటి పలు రకాల ఎరువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిల్వ వివరాలు తప్పకుండా స్టాక్ రిజిస్టర్‌తో పాటు స్టాక్ బోర్డులో నమోదు చేయాలని సూచించారు. మండలంలో 370 మెట్రిక్ టన్నుల ఎరువు అందుబాటులో ఉందని వివరించారు.

ఘనంగా ఆచారి జన్మదిన వేడుకలు

కల్వకుర్తిరూరల్: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి జన్మదిన వేడుకలను గురువారం బీజేపీ నాయకుడు పారిశ్రామిక వేత్త గుర్రాల రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహబూబ్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు నర్సింహ, ఎన్నం శేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, నరేట్ల శేఖర్‌రెడ్డి, బాబిదేవ్, బండెల రామచంద్రారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, గంగాధరాచారి తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు, పూలమాలలతో కార్యకర్తలు సన్మానించారు. నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, పరమేశ్వర్‌గౌడు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో ఆచారిని సన్మానిస్తున్న రాంభూపాల్‌రెడ్డి, నర్సింహ తదితరులు

డాక్టరేట్ సురేష్‌కు సన్మానం



సురేష్‌శెట్టిని సన్మానిస్తున్న ఉపేందర్‌రెడ్డి, రమేష్ తదితరులు

కల్వకుర్తిరూరల్: ఇటీవల ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ తమిళనాడు నుంచి డాక్టరేట్ అందుకున్న పూరి సురేష్‌శెట్టిని గురువారం ఉపేందర్‌రెడ్డి, రమేష్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో సన్మానించారు. కరోనా సమయంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తించి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కార్యక్రమంలో బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై రైతుల ఆసక్తి



యాపట్లలో సాగుచేసిన ఆయిల్‌పాం తోట

పెద్దకొత్తపల్లి: మండలంలోని రైతులు సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి వాణిజ్య పంటల వైపు అడుగులు వేస్తున్నారు. మండలంలో ఆయిల్‌పాం తోటల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో 300 ఎకరాలలో ఆయిల్‌పాం సాగు చేపట్టారు. కొత్తగా సాగు చేపడుతున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై మొక్కలు అందిస్తున్నారు.

'ఆర్‌ఎస్పీని విమర్శించే నైతికత కాంగ్రెస్‌కు లేదు'

చిన్నంబావి: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించే నైతికత కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీటీసీ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికలల్లో గెలుపు ఓటములు సహజమని కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు రాజకీయాలు చేస్తూ హత్యలకు పూనుకొంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు బహిరంగంగా తిరుగుతున్నారని ప్రశ్నించారే తప్ప ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించలేదన్నారు. కానీ మండల కాంగ్రెస్ నాయకులు దానికే ఎందుకు ఉలికి పడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో హత్య రాజకీయాలు చేసిన ఘనత మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడికే చెందుతుందని, ఇప్పుడు సుద్దపూస మాదిరిగా మట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మండల సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ హత్య జరిగి రెండు వారాలు గడిచినా నిందితులను గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జయగౌడ్, చిన్నమారు మధు, దేగ శేఖర్, తగరం కురుమయ్య, ప్రకాష్ పరమాళ్ల, శివుడు, రామస్వామి, మధు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు సిద్ధం చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ కృష్ణ

చారకొండ: హరితహారానికి గ్రామ నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని డీపీఓ కృష్ణ అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో గురువారం ఆయన గ్రామంలో అభివృద్ధి పనులు పరిశీలించి, వివరాలు సేకరించారు. అనతరం నర్సరీలో మొక్కలు పరిశీలించారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు ఉన్నారు.

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రా స్వామి దేవాలయం సంబంధించి సర్వే నెం 327, 328లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించుకున్న ఇండ్లను గురువారం జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఇండ్ల నిర్మాణదారులు సంబంధిత పత్రాలు ఉంటే పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలని సూచించారు. అక్రమంగా ఇండ్లు నిర్మించుకున్న వారికి పంచాయతీ కార్యదర్శితో నోటిసులు అందించారు. సరైన పత్రాలు లేకుంటే చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

నిరుపయోగంగా బస్టాండ్



బల్మూర్: మండల కేంద్రంలో 1999లో నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి బస్టాండ్ నిర్మించినా నిరుపయోగంగా మారిందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతోనే బస్టాండ్ వీధి కుక్కలు, పందులకు ఆవాసంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో బస్సులు నిలుపడం లేదని ప్రయాణికులు వాపోయారు. వర్షాకాలం, వేసవి కాలంలో నిలువ నీడ గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌కు మరమ్మతు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దంచికొట్టిన వాన



గుజ్జరి చెరువులో చేరిన నీరు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం భారీవర్షం కురిసింది. దీంతో కాల్వలు పొంగిపొర్లాయి. పంటపొలాలు చెరువులను తలపించాయి. వీధులలో వర్షపు నిలిచింది. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణం చల్లబడటంతో రైతులు పొలాల పనుల్లో నిమగ్నం అయ్యాయి.

తెలకపల్లి: మూడు నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలాల పనుల్లో బిజీబిజీగా గడుతున్నారు. పత్తి విత్తనాలు విత్తుతున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

48 మి.మీ వర్షపాతం నమోదు

లింగాల: నైరుతి రుతుపవనాలు రాకతో మండలంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. బుధవారం రాత్రి 48.4 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇటీవల ఆర్టీటీ వారు దారారం సమీపంలో నూతనంగా నిర్మించిన చెక్ డ్యామ్ నిండి అలుగు పారింది. దీనితో రైతులు చెక్ డ్యామ్ దగ్గర పూజలు నిర్వహించారు. వానాకాలం పంటలకు అదును కావడంతో భూములను దున్నే పనులలో రైతులు నిమగ్నమయ్యారు. విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు.



తాడూరులో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

పొంగిన వాగులు

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర మండలాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. లోకేశ్వరం, జంగంరెడ్డిపల్లి గుజ్జరి,పదర కొత్త చెరువులల్లో భారీ స్థాయిలో నీరు చేరింది.